క్లుప్తంగా

తాగునీటి బోరు ఏర్పాటు



పామర్రు: వీరాంజనేయ కాలనీలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అక్కడ తాగు నీటి బోరును ఏర్పాటు చేసి కాలనీ వాసుల సమస్యను పరిష్కరించినట్లు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. తొలుత వీరాంజనేయ కాలనీలో బుధవారం తాగునీటి బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరాంజనేయ కాలనీకి తాగునీటి ఏర్పాటు కోసం పామర్రు మండల పరిషత్ నిధులు రూ.3.50 లక్షలు మంజూరు చేసి, పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల కన్వీనర్ గుంప గంగాధర్ పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు



పమిడిముక్కల: మంటాడ గ్రామాన్ని చెత్తర హిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపారు. మంటాడ-లంకపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త, వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగింపు చర్యలు బుధవారం చేపట్టామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్లను నియమించి, వాహనాలు ఏర్పాటు చేసి, గ్రామంలో చెత్త సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా శాంతి కల్యాణం



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామి కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షించారు.

కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం



మండవల్లి: స్థానిక శివాలయం వీధిలో కొలువైన శ్రీకోదండరామ స్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ వెంకయ్య దంపతులచే శ్రీరామ పరివార హోమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు గుడివాడ మురళీకృష్ణ, కొల్లా కృష్ణ, బండి రంగారావు, గుడివాడ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల ఉద్యోగాలకు భద్రత కల్పించాలి



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల ఉద్యోగాలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్మికులు ధర్నా చేశారు. జిల్లా సీఐటీయూ నాయకుడు ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయటానికి కుట్ర పన్నుతోందన్నారు. ఈ కారణంగా మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని విమర్శించారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులందరూ ఐక్యంగా పోరాటం చేయటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచే విధంగా కార్మికులు పోరాటం చేయాలని అన్నారు. సీఐటీయూ మండల నాయకుడు ఎస్‌కే.మస్తాన్‌వలి మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ రూ.6 వేలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో కార్మికులు సమ్మె చేసిన కాలానికి జీతం కూడా ఇవ్వాలన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో కొత్తగా కార్మికులను పనుల్లోకి తీసుకోవటానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్, కమిషనర్ భవానిప్రసాద్ యత్నిస్తున్నారన్నారు. ఈ ధర్నాలో మున్సిపాలిటీ కార్మిక సంఘ నేతలు వై.సరళ, ఏడుకొండలు, రత్నకరుణ, జి.నరసమయ్య, బిక్షాలు, వెంకటరెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను విలీనం చేయొద్దు

కలెక్టర్ బాలాజీకి విజ్ఞప్తి

గుడ్లవల్లేరు: తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను విలీన ప్రక్రియకు సింగలూరు వాసులుససేమిరా అన్నారు. బుధవారం గ్రామంలో జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ నిర్వహించిన సమావేశంలో ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. పాఠశాలను తమ గ్రామంలోనే ఉంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తమ పాఠశాలను చంద్రాల పాఠశాలలో విలీనం చేస్తే.. కనీస రవాణా సౌకర్యం కూడా తమ పిల్లలకు లేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. తమ గ్రామస్తులంతా తరతరాలుగా ఇదే పాఠశాలలో విద్యనభ్యసించి అనేక రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగినట్లు చెప్పారు.

పిల్లలు తిరిగి వచ్చేంత వరకు ఆందోళన

కొత్తగా కిలోమీటర్ల దూరాన ఉన్న పాఠశాలలకు గుడ్లవల్లేరు, చంద్రాల వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే పిల్లలు తిరిగి వచ్చేంత వరకు తమకు ఆందోళనగా ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ చంద్రాల పాఠశాల్లో అయితే ఐదారుగురు టీచర్లు సబ్జెక్టుల వారీగా చదువులు చెప్పే అవకాశం ఉంటుందన్నారు. అలా మండలంలోని అంగలూరు మెయిన్, గుడ్లవల్లేరు- 2, కొతవరం ఒకటో వార్డు, కొతవరం చెక్‌పోస్ట్, వడ్లమన్నాడు మెయిన్, డోకిపర్రు మెయిన్ పాఠశాలల విలీనానికి అక్కడి తల్లిదండ్రులు ఒప్పుకుని డిక్లరేషన్లు కూడా ఇచ్చారని తెలిపారు. అయితే తమ గ్రామంలోని పాఠశాలను గ్రామంలో విలీనం చేయడం తమకు ఇష్టం లేదని సింగలూరు వాసులు తేల్చి చెప్పారు. దీంతో కలెక్టర్ బాలాజీ వెనుతిరిగారు. కార్యక్రమంలో డీఈఓ రామారావు, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, ఎంపీడీఓ టి.విజయసారథి, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంఈఓ జి.గోపాలరావు, కార్యదర్శులు జె.నరసింహరావు, చాపరాల రాజేష్, ఎలీషారావు, ఉప సర్పంచ్ నందం శ్రీనివాసరరావు, గ్రామస్తులు నందం నాగ సుధాకర్, మాచర్ల రమణయ్య, బిట్రా అర్జునరావు, నాగ మల్లేశ్వరరావు, పైడేశ్వరరావు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



రాజేష్ అందించిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ



కలెక్టర్ బాలాజీతో మాట్లాడుతున్న సింగలూరు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు

చంద్రాల పాఠశాల్లో తరగతులను తగ్గించొద్దు

మండలంలోని చంద్రాలలో ఏడో తరగతి వరకు దశాబ్దాలుగా యూపీ స్కూల్‌గా నడుస్తుండగా.. ఐదో తరగతి వరకే ఉంచి, రెండు తరగతులను తగ్గిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎరుకపాటి రాజేష్ కోరారు. ఈ విషయమై బుధవారం జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీకి వినతిపత్రాన్ని ఆయన సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా ఏడో తరగతి వరకు ఉన్న పాఠశాల్లో ప్రభుత్వ కొత్త నిర్ణయంతో ఐదో తరగతి వరకు కుదించే ప్రక్రియను తమ గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారని రాజేష్ తెలిపారు. పాత పద్ధతిలోనే అదే ఏడో తరగతి వరకు క్లాసులను నిర్వహించాలని కోరారు. డీఈఓ రామారావు, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్ కుమార్, ఎంపీడీఓ టి.విజయసారథి, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంఈఓ జి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కొడాలి నానికి ఆపరేషన్ విజయవంతంకావాలి

గుడివాడరూరల్: హృద్రోగ సమస్యలతో ముంబయిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ హార్ట్ ఆస్పత్రిలో మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి జరగనున్న ఆపరేషన్(సర్జరీ) విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కొడాలి నాని అభిమానులు పట్టణంలోని పలు ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు బుధవారం చేశారు. మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వర స్వామి ఆలయం, నీలామహాల్‌రోడ్డులోని శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు. ఒక్కో ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం రైల్వేస్టేషన్‌రోడ్డులోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, నాయకులు వెంపటి సైమన్, కొంకితల ఆంజనేయప్రసాద్, నీలపు మోహన్‌రెడ్డి, తోట రాజేష్, దుద్దు చిన్న, లోయ రాజేష్, కృష్ణమోహన్, వెంకటలక్ష్మి, ఉమా, రమణకుమార్, హారిక, గుడ్లవల్లేరు రవి, బాజీ, ఆలీబేగ్, రమీజా, పామర్తి రామ్మోహనరావు పాల్గొన్నారు.



విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

ఉపాధి పనులు ప్రారంభం



తోట్లవల్లూరులో ఉపాధి కూలీలతో సర్పంచ్ రాధిక



ఉలవలపూడిలో బోదె తవ్వకాలను పరిశీలిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

తోట్లవల్లూరు: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక పేర్కొన్నారు. గ్రామంలోని కనక దుర్గమ్మ కాలనీ వద్ద బుధవారం ఉపాధిహామీ పనులను ఆమె ప్రారంభించారు. ఫీల్డ్ అసిస్టెంట్ చింతలపూడి రమేష్, మేట్లు పాల్గొన్నారు.

గురివిందపల్లిలో..

ఉపాధి పనులను సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ బుధవారం ప్రారంభించారు. ఉప సర్పంచ్ పోతురాజు నాగజయరాజు, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ చందోలు నవీన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో మేలు

గుడ్లవల్లేరు: ఉపాధి హామీ పనుల నిర్వహణతో రైతులకు మేలు చేకూరుతుందని ఉలవలపూడి గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు తెలిపారు. మండలంలోని ఉలవలపూడిలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులను బుధవారం నిర్వహించారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు

తోట్లవల్లూరు: భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తహసీల్దార్ ఎం. కుసుమ కుమారి తెలిపారు. మండలంలోని చాగంటిపాడు సచివాలయం వద్ద బుధవారం భూముల రీసర్వేపై గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేతో భూములకు హద్దులు ఏర్పడి, రైతుల మధ్య వివాదాలు లేకుండా ఉంటాయన్నారు. రికార్డుల ప్రక్షాళన జరగటంతోపాటు భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయటం , పాస్ పుస్తకాలు మంజూరు, ఆధార్ లింకింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. చాగంటిపాడు గ్రామానికి సంబంధించి లంక, మాగాణి భూములు కలిపి సుమారు 2,800 ఎకరాలు ఉన్నాయని, మూడు నెలలపాటు రీసర్వే జరుగుతుందని తెలిపారు. వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, ఉప సర్పంచ్ మర్రెడ్డి శేషిరెడ్డి, రీసర్వే డీటీ ఎస్.వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓ బాలకోటయ్య పాల్గొన్నారు.



చాగంటిపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ కుసుమకుమారి

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమం

కూచిపూడి(మొవ్వ): ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ పతనమైందని కృష్ణా జిల్లా రైతు సంఘం కార్యదర్శి గుత్తికొండ రామారావు ఆరోపించారు. జాతీయ స్థాయిలో సీపీఐ నిర్వహిస్తున్న ప్రచార ఆందోళన కార్యక్రమంలో భాగంగా మొవ్వ మండలం పెదపూడి-కూచిపూడి ప్రధాన కూడలిలో బుధవారం ప్రచార ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్లో దుకాణాల యజమానులకు, ప్రయాణికులకు సీపీఐ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా సీపీఐ సమితి సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, పామర్రు నియోజకవర్గ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి చందోలు నాగేశ్వరరావు, శాఖా కార్యదర్శులు కొండా నాగేశ్వరరావు, మోదుమూడి సద్గుణరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా నాగవల్లి, ఉపాధ్యక్షులు సిద్ధాబత్తుల వాసు పాల్గొన్నారు.



కూచిపూడి-పెదపూడి కూడలిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 444 మంది

పమిడిముక్కల: బీసీ, ఈబీసీలకు సంబంధించి కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 444 మంది హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఏఓ రామకృష్ణ, ఏపీఎం వెంకటేశ్వర్లు, బ్యాంకర్లు అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించారు.

కైకలూరులో..

కైకలూరు: మండంలోని బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్లకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 2,395 మంది మండలం మొత్తం మీద దరఖాస్తులు అందించారు. వీరిలో 1,831 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, ఆన్‌లైన్ వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పమిడిముక్కలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ, బ్యాంకర్లు

ఆటిజం వైకల్యాన్ని ఆదిలోనే గుర్తించాలి

కైకలూరు: చిన్నారుల్లో ఆటిజం వైకల్యాన్ని తల్లిదండ్రులు ఆదిలోనే గుర్తించి వైద్యం అందించాలని మండల విద్యాశాఖాధికారి డి.రామారావు పేర్కొన్నారు. ఆటిజం దినోత్సవం సందర్భంగా కైకలూరు భవిత సెంటర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు బుధవారం అవగాహన, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జన్యుపరమైన, పర్యావరణ కారణాల వలన ఆటిజం ఏర్పడి మెదడు పనితీరుపై ప్రభావితం చూపుతుందన్నారు. భవిత సెంటర్ ఐఈఆర్‌టీ జి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్ (ఏఎస్‌డీ)గా పిలుస్తారన్నారు. పిల్లల అభివృద్ధికి ఆటంకం కలిగించే ఒక రుగ్మతగా ఆటిజాన్ని పరిగణిస్తారన్నారు. బిడ్డ మొదటి మూడు సంవత్సరాల్లో లక్షణాలను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ఆటిజం చిన్నారులకు భవిత సెంటర్లలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉర్దూ, ఎంపీపీ పాఠశాలల హెచ్ఎం మహమ్మద్ ఈసా, రామారావు, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రశిక్ష పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు: దివ్యాంగ విద్యార్థులు సమగ్ర శిక్ష ద్వారా అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు కోటయ్య సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కోటయ్య, ఐఈఆర్‌పీ నిరుపమ, విద్యార్థులతో కలిసి కట్ చేశారు. ఆటిజం ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా కొంతవరకు ఉపశమనం కలుగుతుందని కోటయ్య అన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉజ్వల, నాగలక్ష్మి, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పామర్రులో..

ఎలకుర్రు(పామర్రు): అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆటిజంతో పిల్లలు ఎక్కువగా పుడుతున్నారని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు పీ సురేష్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలో కేడీబీ ట్రస్టు ప్రాంగణంలో ప్రపంచ ఆటిజం డే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేడీబీ ట్రస్టు నిర్వాహకులు కాశీనాధుని నాగేశ్వరరావు మాట్లాడుతూ 20 ఏళ్లగా ప్రతి నెలలో నాలుగు లేక ఐదుసార్లు ట్రస్టులో వైద్య శిబిరాలను నిర్వహించి, సేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన ర్యాలీ

ముదినేపల్లి రూరల్: ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ముదినేపల్లిలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక భవిత కేంద్రం వద్ద ఈ ర్యాలీని ప్రారంభించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.గంగాకుమారి మాట్లాడారు. ఆటిజం నాడీ సంబంధిత సమస్య అని దీని వలన పిల్లలు ఒంటరిగా ఆడుకోవడం, పిలిచినా పలకకపోవడం, నేరుగా చూడలేకపోవడం వంటి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, సీఎఆర్పీ బి.నీలిమ, సీజీవీ జి.భవానీ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని లోకుమూడి భవిత స్పెషల్ స్కూల్లో ఆటిజం అవగాహన దినోత్సవం బుధవారం నిర్వహించారు. హైస్కూల్‌కు చెందిన పి.నరసింహారావు, ఎంపీపీఎస్ హెచ్ఎం ఎండీ సుఫియాన్ ఆధ్వర్యంలో ఆటిజం అవగాహన ర్యాలీ నిర్వహించారు.



కైకలూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ రామారావు, సిబ్బంది



తోట్లవల్లూరు భవిత కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఎలకుర్రులో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న వైద్యులు

మట్టిని తొలగించండి



కైకలూరు: డ్రెయిన్లలో తీసిన మట్టిని తొలగించాలని దుకాణదారులు కోరుతున్నారు. కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా పామర్రు-దిగమర్రు జాతీయ రహదారి పక్కన 10 రోజుల క్రితం డ్రెయినేజీలో సిల్ట్‌ను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఇప్పటి వరకు వాటిని తొలగించలేదు. దుకాణదారులు పలుమార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మట్టిని తొలగించాలని పలువురు కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు: నియోజకవర్గంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ వి.దీప్తి బుధవారం పేర్కొన్నారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, ఏడు సహాయకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తగా కైకలూరు మండలం గుమ్మళ్లపాడు-2 (ఎస్సీ), సహాయకురాలిగా కైకలూరు మండలంలో కైకలూరు 9వ వార్డు (ఈడబ్ల్యూఎస్), జంగంపాడు (బీసీ-ఏ), కలిదిండి మండలంలో చింతలమోరు (ఎస్సీ), మండవల్లి మండలంలో తక్కెళ్లపాడు-1 (ఎస్సీ), మండవల్లి-2 (ఎస్సీ), ముదినేపల్లి మండలంలో అల్లూరు-1 (ఓసీ), ముదినేపల్లి-4 (ఓసీ)గా రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17న సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు కైకలూరు సీడీపీఓ కార్యాలయంలో అందించాలన్నారు. అభ్యర్థులు ఆయా ప్రాంతాల్లో స్థానికులుగా ఉంటూ వివాహితులుగా ఉండాలని పేర్కొన్నారు. 2025 జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. కార్యకర్త, సహాయకులు ఇద్దరూ పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. పదో తరగతి ధ్రువపత్రం, టీసీ, కుల, నివాస, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్సులపై గెజిటెడ్ అధికారి సంతకం, రెండు కలర్ ఫొటోలతో రెండు సెట్లు అందించాలన్నారు. దరఖాస్తులు కైకలూరు కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

అమ్మా భవానీ.. అందుకో నివేదన




పాలపొంగళ్లను అమ్మవారికి సమర్పించడానికి వస్తున్న మహిళలు

కోడూరు: స్థానిక గంగాభవానీ అమ్మవారికి బుధవారం పాలపొంగళ్లతో మహానివేదన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారి 50వ జాతరోత్సవాలను పురస్కరించుకుని ఉదయం అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్ల తయారు చేసేందుకు వీలుగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేయడంతో, ఉదయం 7గంటల నుంచే మహిళలు వేలాదిగా తరలివచ్చారు. సుమారు నాలుగు వేల మంది మహిళలు ఆలయం వద్దే పాలపొంగళ్లను సిద్ధం చేసి అమ్మవారికి నివేదించారు. దీంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఆలయ కమిటీ పిలుపుతో హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై ప్రాంతాల నుంచి కోడూరు ప్రాంత మహిళలు తరలివచ్చి ఈ పాలపొంగళ్ల నివేదనలో పాల్గొన్నారు.

నేడు మహాచండీయాగం..

జాతరోత్సవాల నేపథ్యంలో గురువారం ఆలయం వద్ద మహాచండీయాగాన్ని నిర్వహించనున్నట్లు ధర్మకర్త కోట యుగంధరరావు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు చండీయాగం ఉంటుందన్నారు. అనంతరం మహాపూర్ణాహుతిని జరిపి, 25వేల మందికి అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారి మూలమూర్తికి 1,01,108 గారెలతో మహానివేదన జరపనున్నట్లు యుగంధరరావు పేర్కొన్నారు.



ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్లను సిద్ధం చేస్తున్న మహిళలు

నేటి నుంచి సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలు



మచిలీపట్నంటౌన్: సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలకు నగరంలోని రుస్తుంబాదలో వేంచేసి ఉన్న శ్రీ భద్రాద్రి శ్రీ రాముల వారి దేవాలయం ముస్తాబైంది. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి, గాలి గోపురానికి రంగులు వేసి, విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై. శిరీష బుధవారం తెలిపారు. 3వ తేదీ గురువారం నుంచి 9వ తేదీ బుధవారం వరకూ ఉత్సవాలు జరుగుతాయని ఆమె తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనపూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, జగజ్యోతి, వైనతేయ పట ప్రతిష్ట వంటి పూజా కార్యక్రమాలతో కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 6వ తేదీ ఆదివారం ఉదయం 7.30 గంటలకు నిత్య హోమం, చతుస్థానార్చన, బలిహరణ, 10 గంటలకు శ్రీ భద్రాద్రి సీతారామ కల్యాణ మహోత్సవాన్ని కూనపరెడ్డి శ్రీ కృష్ణారావు దంపతులచే నిర్వహిస్తామన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు పానకం, వడపప్పు అందజేసి, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈఓ శిరీష తెలిపారు.